అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లాల్సిన కోడి గుడ్లను మార్కెట్‌లో విక్రయిస్తున్న పెంటయ్య

అంగట్లో అంగన్‌వాడీ గుడ్లు

➤ మొదటిపేజీ తరువాయి...

గ్రామానికి చెందిన పెంటయ్య డీసీఎం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం ఆయన చౌడాపూర్ మండల కేంద్రంలో రూ.5 చొప్పున కోడిగుడ్లను విక్రయిస్తున్నాడు. స్థానికులు కొందరు వీటిని అంగన్‌వాడీ కేంద్రాల్లో పంపిణీ చేసే గుడ్లుగా గుర్తించారు. వాటిపై తెలంగాణ ప్రభుత్వం అనే ముద్ర కూడా ఉన్నది. అప్పటికే అతని వద్ద ట్రేలలో 600లకు పైగా గుడ్లు ఉన్నాయి. వెంటనే పంచాయతీ కార్యదర్శికి సమాచారం అందించగా ఆయన వెళ్లి గుడ్లను పరిశీలించి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ప్రభులు గుడ్లను విక్రయిస్తున్న పెంటయ్యను పిలిపించి విచారణ జరుపగా.. అవి అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన గుడ్లేనని అంగీకరించాడు. మెదక్ జిల్లా తూప్రాన్‌లోని స్నేహితుడు వెంకటేశ్ దగ్గర నుంచి గుడ్లను తీసుకొచ్చి, కొంతకాలంగా విక్రయిస్తున్నట్టు చెప్పాడు. తహసీల్దార్ వాటిని స్వాధీనం చేసుకొన్నారు. సోమవారం గుడ్లను ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తామని చెప్పారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ ఫిర్యాదు మేరకు పెంటయ్యపై కేసు నమోదు చేసినట్టు కులకచర్ల ఎస్సై శ్రీశైలం ప్రభుత్వం అందిస్తున్న కోడి గుడ్లను బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నా ఐసీడీఎస్ అధికారులు పట్టించుకోకపోవడంపై పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

నోటీసులను చూపుతున్న రైతులు, బీఆర్‌ఎస్ నాయకుడు రాజునాయక్

లక్ష చెల్లిస్తే రూ.3 లక్షలు ఇస్తాం!

- ఐటీ శాఖ పేరుతో 10 మంది గిరిజన రైతులకు తపాలా శాఖ ద్వారా నోటీసులు
- సైబర్ నేరగాళ్ల పనే: బీఆర్‌ఎస్ నేత రాజు వెల్లడి

శంషాబాద్ రూరల్, జనవరి 21: లక్ష చెల్లిస్తే రూ.3 లక్షలు చెల్లిస్తామని ఐటీశాఖ (ఇన్‌కమ్ ట్యాక్స్) పేరుతో శంషాబాద్ మండలంలోని పది మంది గిరిజన రైతులకు తపాలా శాఖ ద్వారా నోటీసులు అందడం కలకలం సృష్టించింది. పాలమాకుల పంచాయతీ అనుబంధ గ్రామం కలబండతండాకు చెందిన పది మంది రైతులకు రూ.లక్ష చెల్లిస్తే రూ.3 లక్షలు ఇస్తాం అని పోస్టు ద్వారా నోటీసులు అందాయి. ఐటీశాఖ నుంచి తమకు నోటీసులు రావడం ఏమిటని స్థానిక బీఆర్‌ఎస్ నాయకుడు రాజునాయక్ దృష్టికి తీసుకెళ్లారు. నోటీసులు సైబర్ నేరగాళ్ల పనే అని ఆయన మీడియాకు ఆదివారం వెల్లడించారు. ఎవరికైనా ఇలాగే నోటీసులు వస్తే ఎలాంటి సమాచారం ఇవ్వకూడదని సూచించారు. సదరు నోటీసులపై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. సమావేశంలో కే హిర్య, కే తేజ్యా, లక్ష్మణ్, లింగ్యా, ఘోరి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మందులను గుర్తించండిలా!

- కొనే సమయంలో జాగ్రత్త తప్పనిసరి
- చిన్న వ్యత్యాసాలతో ఔషధాల గుర్తింపు
- డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ సూచన
- ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్ 1800599696

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు వేసుకునే ఔషధాలు నకిలీవి అయితే.. వ్యాధి తగ్గకపోగా కొత్త ఆరోగ్య సమస్యలు చుట్టుముడుతాయి. ఇటీవల డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ (డీసీఏ) అధికారులు వరుసగా నకిలీ ఔషధాల తయారీ కంపెనీలపై దాడులు చేస్తూ, వాటిని సీజ్ చేస్తున్నారు. ఇతర రాష్ర్టాల నుంచి వస్తున్న నకిలీ మందులను అడ్డుకుంటున్నారు. ఈ నేపథ్యంలో మందులు కొనే సమయంలో కచ్చితంగా జాగ్రత్తగా ఉండాలని, ఒకటికి రెండు సార్లు చెక్ చేసుకోవాలని డీసీఏ హెచ్చరిస్తున్నది. ఇటీవల వరుసగా నకిలీ ఔషధాల తయారీ సంస్థలు, రవాణా రాకెట్ పట్టుబడుతున్న నేపథ్యంలో నకిలీ ఔషధాలను ఎలా గుర్తించాలి? ఔషధాలు కొనే సమయంలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అన్న విషయాలను వివరిస్తూ తాజాగా సూచనలు జారీ చేసింది. అనుమతి లేని దుకాణాలు, అనుమతి లేని వెబ్‌సైట్ల నుంచి ఔషధాలు కొనుగోలు చేయొద్దని స్పష్టం చేసింది. ప్రతి మెడికల్ షాప్‌లో లైసెన్స్‌ను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయని, ఈ మేరకు లైసెన్స్‌ను బహిర్గతం చేస్తున్నారో లేదో పరిశీలించాలని సూచిస్తున్నది.

పరిణామాలు ఏమిటంటే..

నకిలీ ఔషధాలతో రోగికి తీవ్ర నష్టం కలుగుతుంది. వ్యాధి తగ్గకపోగా ముదురుతుంది. అందులోని రసాయనాల వల్ల తీవ్ర దుష్ఫలితాలు కలిగే అవకాశం ఉంటుంది. దీంతో ఔషధాలపై, ఔషధ తయారీ సంస్థలపై నమ్మకం తగ్గుతుంది. ఆ మందులను సిఫారసు చేసే డాక్టర్లు, దవాఖానలపై నమ్మకం సడలుతుంది.

గుర్తించడం ఎలా?

నకిలీ ఔషధాలను గుర్తించేందుకు తెలంగాణ డీసీఏ అధికారులు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. నకిలీ ఔషధ రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. నకిలీ మందులు నిజమైన ఉత్పత్తులకు చాలా దగ్గరగా ఉంటాయని, కొన్ని లక్షణాల ఆధారంగా వాటిని గుర్తించవచ్చని చెప్తున్నారు.

పోల్చడం: అసలైన ఔషధాన్ని, నకిలీ ఔషధాన్ని పక్కపక్కన పెట్టి పోల్చినప్పుడు కొన్ని తేడాలు గమనించవచ్చు. ముఖ్యంగా కంపెనీలు ప్యాకింగ్ మార్చినా.. నకిలీ ఔషధాలు పాత ప్యాకింగ్‌లోనే వస్తుంటాయి. పరిమాణం, రంగు, బరువు, క్వాలిటీ, డిజైన్‌లో తేడాలు కనిపిస్తుంటాయి.

స్పెలింగ్ తప్పులు: కంపెనీ పేరు లేదా ఉత్పత్తి పేరు లేదా అందులో ఉన్న రసాయనాల స్పెల్లింగ్ తేడాలు ఉంటాయి. తయారీ తేదీ, గడువు తేదీ, వంటివి ఔషధంతోపాటు బయటి కాటన్‌పై ఉండే వివరాలతో సరిపోల్చుకోవాలి.

చూడటానికి ఒకేలా ఉండాలి: ట్యాబ్లెట్లు షీట్‌లో ఉన్నా, బాటిల్‌లో ఉన్నా అన్నీ చూడటానికి ఒకే రకంగా ఉండాలి. పరిమాణంలో తేడాలు ఉండటం, పగ్రెలు రావడం, విరిగిపోవడం వంటివి గుర్తిస్తే నకిలీవిగా అనుమానించాలి. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు, తరుచూ ఔషధాలు వాడేవారు ఎలాంటి తేడాలు ఉన్నా వెంటనే గుర్తిస్తారు. ఇలాంటి సందర్భాల్లో కంపెనీ వివరాలను కచ్చితంగా చెక్ చేయాలి.

అతి తక్కువ ధర: మనం గతంలో తీసుకున్న ధరతో పోల్చినప్పుడు తక్కువగా ఉండటం, తెలిసినవారు తెచ్చుకున్న ధరలతో పోల్చినా తక్కువకు దొరికితే జాగ్రత్త పడాల్సిందే. కొన్నిసార్లు దుకాణాదారు చాలా ఎక్కువ డిస్కౌంట్ ఇచ్చినా అనుమానించాలి.

అధికారిక ముద్ర: 300 రకాల అత్యవసర మందులకు కచ్చితంగా బార్ కోడ్, క్యూఆర్ కోడ్ ఉండాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. మందులపై లేదా వాటిని ప్యాక్ చేసిన డబ్బాలపై కోడ్ లేకపోతే అనుమానించాలి.

ప్యాకేజింగ్: బ్రాండెడ్ కంపెనీలు ప్యాకేజింగ్ విషయంలో చాలా జాగ్రత్తగా ఉంటాయి. కాబట్టి మందులు తీసుకునే సమయంలో ప్యాకేజింగ్ సరిగా ఉన్నదా? సీల్ సరిగా ఉన్నదా? అన్నది చూడాలి. లీకేజీలు ఉన్నా, తేడాగా ఉన్నా అనుమానించాలి.

సైడ్ ఎఫెక్ట్స్: మందు వేసుకున్న తర్వాత అలర్జీలు, ఇతర సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా వస్తే వెంటనే అప్రమత్తం కావాలి.

బిల్లు తప్పనిసరి: మందులు కొన్న తర్వాత మెడికల్ షాప్ నుంచి కచ్చితంగా బిల్లు తీసుకోవాలి. అందులో ఏయే ఔషధాలు తీసుకున్నారో వివరంగా ఉండాలి. ఎవరైనా బిల్లు ఇవ్వడానికి నిరాకరిస్తే అనుమానించాల్సిందే.

ఫిర్యాదు ఎలా చేయాలి?

నకిలీ మందులు గుర్తిస్తే డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ టోల్ ఫ్రీ నంబర్ 1800599696 కు సమాచారం ఇవ్వవచ్చు. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారు. స్థానిక డ్రగ్ ఇన్‌స్పెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేయవచ్చు.

నకిలీ ఔషధాలతో పెనుముప్పు

నకిలీ ఔషధాలతో ప్రజలకు డబ్బులు వృథా అవడంతోపాటు నష్టం కలిగించడంతోపాటు ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తాయి. కొత్త అనారోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం కూడా ఉంది. అందుకే నకిలీ ఔషధాలను కట్టడి చేసేందుకు మేము తీవ్రంగా ప్రయత్నిస్తున్నాం. ప్రజలు సహకారం అందిస్తే మరింత సమర్థంగా కట్టడి చేయవచ్చు. లైసెన్స్ లేకుండా ఎవరైనా మందులు అమ్మినా, గోదాముల్లో నిల్వ చేసినా, నకిలీ ఔషధాలు గుర్తించినా వెంటనే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు.

– కమలాసన్ రెడ్డి, డీజీ, డీసీఏ

నకిలీ ఎలా చేస్తారంటే?

- సాధారణంగా ప్రజలకు సుపరిచితమైన బ్రాండ్ల ఔషధాలకు నకిలీవి తయారు చేస్తుంటారు. అయితే.. చాలా సందర్భాల్లో వాటిపై ఉనికిలోలేని కంపెనీల పేర్లు, తప్పుడు తయారీ చిరునామాలు ముద్రిస్తుంటారు.
- ఔషధాల్లో ఉండే 'యాక్టివ్ ఇంగ్రేడియెంట్' మన శరీరంలోకి చేరిన తర్వాత వ్యాధిని నియంత్రిస్తుంది. అయితే.. నకిలీ మందుల్లో యాక్టివ్ ఇంగ్రేడియెంట్ ఉండదు. పిండి, మక్కజొన్న పొడి, ఆలుగడ్డ పొడి వంటివి ఉంటాయి.
- కొన్ని సందర్భాల్లో తప్పుడు యాక్టివ్ ఇంగ్రేడియెంట్ వాడుతారు. ఉదాహరణకు 'అమాక్సిసిల్లిన్' ట్యాబ్లెట్లలో 'పారాసిటమాల్' నింపుతారు. లేదా తగినంత పరిమాణంలో యాక్టివ్ ఇంగ్రేడియెంట్ ఉండకపోవచ్చు. ఉదాహరణకు 500 మిల్లీ గ్రాముల అమాక్సిసిలిన్ ట్యాబ్లెట్లలో 50 మిల్లీ గ్రాములు మాత్రమే ఉండొచ్చు. ఇంకొన్ని ట్యాబ్లెట్లలో హానికారక రసాయనాలు ఉండొచ్చు.

ఎస్‌ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ తెలంగాణ రాష్ట్రం (ఎస్‌ఎల్‌టీఏ టీఎస్) నూతన అధ్యక్షుడిగా చక్రవర్తుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కర్రెం గౌరీశంకర్‌రావులను ఎన్నుకొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో సంఘం నూతన కార్యవర్గం ఎన్నికైంది. గౌరవాధ్యక్షులుగా చౌడవరం చంద్రమోహన్, పెండ్యాల బ్రహ్మయ్య, గౌరవ సలహాదారులుగా సుబ్బారావు, రాష్ట్ర సహ అధ్యక్షులుగా షేక్ హాజీ నురానీ, సత్యనారాయణ, కాంబ్లీ, కోశాధికారిగా జగదీశ్వర్, సంయుక్త కార్యదర్శిగా మరిపల్లి రమేశ్, కార్యవర్గ సభ్యులుగా జీవీవీ ప్రసాద్, ఎన్వీ శ్రీదేవి, రాఘవేంద్ర దోత్రే, ఎండీ హమీద్, బొల్ల కుమారస్వామి, ముడుంబ ప్రవీణ్‌ను ఎన్నుకొన్నారు.

రైల్వేలైన్ నిర్మాణం కోసం ఏరియల్ సర్వే

కూసుమంచి, జనవరి 21: కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 12 కొత్త రైల్వే ప్రాజెక్టులు చేపట్టింది. ఇందులో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని డోర్నకల్– మహబూబ్‌నగర్ జిల్లాలోని భూత్పూర్ వరకు రైల్వేలైన్ నిర్మించనున్నది. రైల్వేలైన్ బొగ్గు, సిమెంట్ వంటి వాణిజ్య, వ్యాపార వస్తువుల రవాణాకు ఈ లైన్ ఉపయోగపడనున్నది. ఈ రైల్వేలైన్ సూర్యాపేట జిల్లాకేంద్రంతోపాటు ఖమ్మం జిల్లాలోని పాలేరు నియోజకవర్గం మీదుగా వెళ్లనున్నది. రైల్వేలైన్ నిర్మాణంపై దక్షిణ మధ్య రైల్వే రెండు రోజులుగా నియోజకవర్గంలో ప్రత్యేక ఎయిర్ క్రాఫ్ట్ ద్వారా ఏరియల్ సర్వే చేపడుతున్నది. ఈ సర్వే ఆదివారం కూడా కొనసాగింది. ఎయిర్‌క్రాఫ్ట్ అత్యంత కింద నుంచి ప్రయాణించడంతో నియోజకవర్గ ప్రజలు ఆసక్తిగా తిలకించారు. సర్వేపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నది. ఈ లైన్ ఎంతో ఉపయోగకరంగా ఉండనున్నది.

మధ్యస్తంగా సీటెట్

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ) : సెంట్రల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్) పరీక్ష ఆదివారం సజావుగా ముగిసింది. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లల్లో నిర్వహించిన ఈ పరీక్ష ప్రశ్నలు మధ్యస్తంగా ఉన్నట్టు అభ్యర్థులు తెలిపారు. ఉదయం పేపర్ –1, మధ్యాహ్నం పేపర్–2 సులభం నుంచి మధ్యస్తంగా ఉన్నట్టు అభ్యర్థులు వెల్లడించారు.

రైస్ మిల్లులో 255 క్వింటాళ్ల రేషన్ బియ్యం

- సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్, పోలీసులు
- హుజూరాబాద్‌లో ఘటన

హుజూరాబాద్ టౌన్, జనవరి 21: కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ శివారులోని ఓ రైస్ మిల్లులో నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఆదివారం హుజూరాబాద్ ఏసీపీ జీవన్‌రెడ్డి వెల్లడించిన వివరాల మేరకు.. హుజూరాబాద్ శివారులోని శ్రీనివాస్ రైస్‌మిల్లులో శనివారం అర్ధరాత్రి పెద్దమొత్తంలో రేషన్ బియ్యాన్ని డంపు చేస్తున్నారనే సమాచారం మేరకు పోలీసులు దాడులు చేశారు. టాటా మ్యాజిక్ బండిలో కొన్ని, రైస్‌మిల్లులో నిల్వ చేసినవి కొన్ని కలిపి మొత్తం 961 బస్తాలను గుర్తించారు. వీటిని తూకం వేసి 255 క్వింటాళ్ల బియ్యంగా నిర్ధారించారు. సీజ్ చేసి రెవెన్యూ అధికారులకు అప్పగించారు. మిల్లు యజమాని శ్రీనివాస్ ప్రభుత్వానికి సీఎంఆర్ ఇవ్వకుండా ఎగ్గొట్టాడు. దీనిని పూడ్చుకునేందుకు రేషన్ బియ్యం దందాకు తెరలేపాడు. బోర్నపల్లికి చెందిన పిల్లి శ్రీధర్, వీణవంకకు చెందిన సురేశ్, మెట్‌పల్లికి చెందిన రమేశ్‌కు బియ్యం తీసుకువచ్చే బాధ్యతను అప్పగించాడని ఏసీపీ తెలిపారు.మిల్లు యజమాని ఎస్ శ్రీనివాస్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా, ఇతడికి సహకరించిన సదరు ముగ్గురు పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు.

దండకారణ్యంలో 'సూర్యశక్తి'!

- మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ప్రత్యేక బలగాలు
- ఎత్తుగడలకు చెక్ పెట్టేందుకే కొత్త 'వ్యూహం'
- ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా మావోయిస్టుల పాచికలు
- యుద్ధరంగంగా మారుతున్న రాష్ట్ర సరిహద్దులు

కొత్తగూడెం క్రైం, జనవరి 21 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర సరిహద్దు దండకారణ్యం కేంద్రంగా మావోయిస్టులు పాచికలు వేస్తుంటే.. అవి పారకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొత్త పథకాలను రచిస్తున్నాయి. ఇందులో భాగంగానే మావోయిస్టుల ఏరివేతకు ఇప్పటివరకు ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా దశలవారీగా 'ఆపరేషన్ ప్రహార్' ఊపందుకుంటున్నది. దీంతోపాటే మావోయిస్టులు సైతం తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ ప్రతి వ్యూహాలను పన్నుతున్నారు. ఇప్పుడు వారి ఉనికిని సమూలంగా రూపుమాపేందుకు కొత్త పంథాలో దండకారణ్యాన్ని ఆపరేషన్ 'సూర్యశక్తి' కమ్ముకొస్తున్నది. వివరాల్లోకి వెళ్తే.. మావోయిస్టులు తమ సామ్రాజ్యాన్ని విస్తరించుకొనే దిశగా తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని దండకారణ్యం కేంద్రంగా పావులు కదుపుతూ వస్తున్నారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ కార్యదర్శి నంబాల కేశవరావు నేతృత్వంలో ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా ఇటీవల మావోయిస్టు పార్టీ తమ కార్యకలాపాలను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగానే ఆరు నెలలుగా విధ్వంసకర చర్యలకు పాల్పడుతూ తన ఉనికిని చాటుకుంటున్నది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఇటీవల కాలంలో భద్రతా బలగాలను టార్గెట్ చేస్తూ అనేక విధ్వంసకర చర్యలకు పాల్పడింది. ఇదిలావుండగా.. తాజాగా ఆ పార్టీ కేంద్ర కార్యదర్శితో సహ ఐదు రాష్ర్టాల కీలక నేతలతో సమావేశం ఏర్పాటు చేసి.. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా బడే చొక్కారావు అలియాస్ దామోదర్‌ను నియమించిన విషయం విదితమే. మోస్ట్ వాంటెడ్‌గా ఉన్న దామోదర్ తన వ్యూహాలను సైతం ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం కేంద్రంగా రచిస్తూ.. తెలంగాణలో విస్తరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఈ వ్యవహారాలను సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మావోయిస్టుల చర్యలను సమూలంగా తిప్పికొట్టేందుకే ఆపరేషన్ ప్రహార్‌ను అప్‌గ్రేడ్ చేసినట్టు తెలుస్తున్నది. ఇందులో భాగంగానే కేంద్ర పారా మిలటరీ బలగాలను రప్పించి.. వాటిని అధికారులు వివిధ గ్రూపులుగా విభజించారు. జిల్లా రిజర్వ్ గార్డ్స్(డీఆర్‌జీ), స్పెషల్ టాస్క్ ఫోర్స్ (ఎస్‌టీఎఫ్), బస్తర్ ఫైటర్స్‌ను పారా మిలిటరీ బలగాలకు జత చేస్తూ 'ఆపరేషన్ సూర్యశక్తి'గా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలోనే ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు దక్షిణ ప్రాంతాల్లోని సరిహద్దుల్లో ప్రత్యేక బలగాలతో ఆపరేషన్స్ నిర్వహించారు. మావోయిస్టులు నిర్వహిస్తున్న ఆయుధ తయారీ కర్మాగారాలను ధ్వంసం చేసి.. ఇద్దరు మావోయిస్టులను హతమార్చి, సుమారు 65 మందిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే.

డ్రోన్ బాంబులతో దాడులు

'అడ్మినిస్ట్రేటివ్ అండ్ సెక్యూరిటీ వ్యాక్యూమ్ ఏరియా' అని పిలిచే మావోయిస్టుల ప్రాంతాల్లోకి సైతం చొచ్చుకెళ్లి ఆపరేషన్స్‌ను నిర్వహించేందుకే ఆపరేషన్ సూర్యశక్తిని మరింత బలోపేతం చేస్తున్నట్టు తెలుస్తున్నది. ఇటీవలి కాలంలో ఛత్తీస్‌గఢ్‌లో కాంకేర్, నారాయణ్‌పూర్, బీజాపూర్ జిల్లాలతోపాటు మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సైతం ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఆపరేషన్ సూర్యశక్తిని ప్రయోగించింది. మావోయిస్టుల ఆపరేషన్స్ పేరుతో డ్రోన్ బాంబులను ప్రయోగిస్తూ పోలీసులు దాడులు చేస్తున్నట్టు పది రోజుల క్రితం మావోయిస్టు పార్టీ పేరుతో లేఖ విడుదలైన విషయం తెలిసిందే. దట్టమైన అటవీ మార్గంలోకి చొచ్చుకుపోయి మావోయిస్టుల స్థావరాలను ధ్వంసం చేసేందుకు ఆపరేషన్ సూర్యశక్తి పని చేస్తున్నట్టు తెలుస్తున్నది. మావోయిస్టులు–భద్రతా దళాల మధ్య జరుగుతున్న పోరు దండకారణ్యాన్ని రణరంగంగా మార్చింది. ఇరువర్గాల మధ్య జరుగుతున్న యుద్ధం మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ, గిరిజనులతోపాటు ఇతర ఏజెన్సీలోని సామాన్య ప్రజలను సైతం భయభ్రాంతులకు గురిచేస్తున్నది.

రాష్ట్రపతి తేనీటి విందుకు నెల్లుట్ల సర్పంచ్ దంపతులకు ఆహ్వానం

స్వరూపారాణి

భూపాల్‌రెడ్డి

లింగాలఘనపురం, జనవరి 21 : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 26న ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగే వేడుకలకు జనగామ జిల్లా లింగాల ఘనపురం మండలం నెల్లుట్ల బీఆర్‌ఎస్ సర్పంచ్ చిత్ర స్వరూపారాణి, భూపాల్‌రెడ్డి దంపతులకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా రాష్ట్రపతి నివాసంలో జరిగే (ఎట్ హోం) తేనీటి విందుకు ఆహ్వానం అందినట్టు సర్పంచ్ స్వరూప రాణి తెలిపారు. గ్రామంలో జలవనరుల అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినందుకు గాను నిరుడు ఏప్రిల్ 17న రాష్ట్రపతి చేతుల మీదుగా జాతీయ స్థాయి అవార్డును అప్పటి పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు సమక్షంలో తీసుకున్నారు. గత ఏడాది వివిధ విభాగాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 46 జాతీయ అవార్డుల్లో జల వనరుల అభివృద్ధిపై జాతీయ స్థాయి అవార్డు తీసుకున్నారు.

41.4 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత
- జాంబియాకు చెందిన మహిళ అరెస్టు

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టుబడిన హెరాయిన్

శంషాబాద్ రూరల్, జనవరి 21: శంషాబాద్‌లోని రాజీవ్‌గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఆదివారం పెద్ద మొత్తంలో హెరాయిన్ డ్రగ్ పట్టుబడింది. సూట్‌కేసు అడుగుభాగంలో దాచి అక్రమంగా స్మగ్లింగ్ చేస్తున్న రూ.41 కోట్ల విలువైన డ్రగ్స్‌ను అధికారులు సీజ్ చేశారు. నిందితురాలిని జాంబియాకు చెందిన లుసాకాగా గుర్తించారు. కస్టమ్స్ అధికారుల వివరాల ప్రకారం.. జింబాబ్వే నుంచి సింగపూర్ మీదుగా హైదరాబాద్ (శంషాబాద్) ఎయిర్‌పోర్టుకు వచ్చిన దక్షిణ ఆఫ్రికాలోని జాంబియాకు చెందిన మహిళపై అనుమానంతో ఆమెతోపాటు లగేజీని అధికారులు తనిఖీ చేశారు. సూట్‌కేసులోని డాక్యుమెంట్ ఫోల్డర్‌లో దాచి తీసుకొస్తున్న 5.92 కిలోల హెరాయిన్ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన డ్రగ్స్ విలువ దాదాపు రూ.41.4 కోట్లు ఉంటుందని అంచనా. తన హ్యాండ్ బ్యాగులో దాచుకొని డ్రగ్స్ తీసుకొస్తున్న సౌతాఫ్రికాకు చెందిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. కేసు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నీటికుంటలో మునిగి ఇద్దరు బాలురు మృతి

సత్తుపల్లి రూరల్, జనవరి 21: నీటికుంటలో పడి ఇద్దరు బాలురు మృతి చెందారు. ఈ ఘటన ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం కాకర్లపల్లిలో చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ఇస్రం వికాస్ (9), కోలా సిద్ధార్థ (12) స్నేహితులు. స్థానిక పాఠశాలలో ఐదో తరగతి, ఏడోతరగతి చదువుతున్నారు. ఆదివారం సెలవు కావడంతో మరో బాలుడితో కలిసి వీరు సమీపంలోని నీటికుంట వద్దకు వెళ్లారు. అక్కడ బాతులను ఆడించేందుకు వికాస్, సిద్ధార్థ నీటిలోకి దిగి గల్లంతయ్యారు. ఒడ్డున కూర్చున్న మరో బాలుడు గ్రామస్థులకు సమాచారమిచ్చాడు. గ్రామస్థుల సాయంతో తల్లిదండ్రులు వికాస్, సిద్ధార్థ మృతదేహాలను బయటకు తీయించారు. సీఐ మోహన్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. వీరిద్దరి మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

దత్తత బడి దశ మార్చారు!

- సర్కారు పాఠశాలల రూపురేఖలు మార్చిన ఎన్నారైలు
- మాసాయిపేట హైస్కూల్, ప్రైమరీ స్కూల్ నేడు ప్రారంభం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): చదువు విలువ తెలిసిన వారు ఖండాంతరాలు దాటి వెళ్లినా సొంతూరిపై ఆ విలువలను వెదజల్లాలనుకున్నారు. పుట్టిన గడ్డకు మంచి చేయాలన్న తలంపుతో పాఠశాలలను దత్తత తీసుకున్నారు. వారి సొంత ఖర్చులతో రూపురేఖలే మారి నేడు ఆ స్కూళ్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ ఊరిపై లండన్‌లో స్థిరపడిన డాక్టర్ మాధవి, శ్రీకాంత్‌లు మమకారాన్ని పంచి శెభాష్ అని గ్రామస్థుల నుంచి అభిమానం పొందారు. మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రం డాక్టర్ మాధవి, శ్రీకాంత్‌ల సొంతూరు. ఆ ఊరిలో వసతుల లేమితో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల, ప్రాథమిక పాఠశాలల గురించి గ్రామస్థుల ద్వారా తెలుసుకొన్న మాధవి, శ్రీకాంత్‌లు వాటిని దత్తత తీసుకున్నారు. లయన్స్ క్లబ్, సుగుణ రామ్మోహన్ ఎడ్యుకేషనల్ సొసైటీల ద్వారా ఆయా పాఠశాలను నేడు ప్రగతి పథంలో నిలిపారు. తొలుత ప్రాథమిక పాఠశాలలో సుమారు రూ.5 లక్షలతో మౌలిక వసతులు ఏర్పాటు చేశారు.

30 లక్షలతో హైస్కూల్‌లో మౌలిక వసతులు

మాసాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం ఎన్నారైలు డాక్టర్ మాధవి, శ్రీకాంత్‌లు సుమారు రూ.30 లక్షలకు పైగా నిధులను ఖర్చుచేశారు. హైస్కూల్ ఆవరణలో సైన్స్‌ల్యాబ్, గ్రంథాలయాన్ని నిర్మించారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బెంచీలను సమకూర్చారు. అన్నిగదులను రంగులతో అలంకరించారు. తరగతి గదుల గోడలపై ఆకట్టుకునేలా విద్యాసంబంధ చిత్రాలను గీయించారు. పలురకాల పుస్తకాలను అందించారు. సర్వాంగ సుందరంగా తయారైన రెండు పాఠశాలలను సోమవారం జిల్లా కలెక్టర్ సహా ఆయా సంస్థల ప్రతినిధులు ప్రారంభించనున్నారు. 2016లో తలకొండపల్లి జెడ్పీ హైస్కూల్‌ను ఎన్నారైలు డాక్టర్ మాధవి, శ్రీకాంత్ దత్తత తీసుకొని అభివృద్ధి చేయడం విశేషం.

పోలీసు కస్టడీకి 'పాస్‌పోర్టు' నిందితులు

విచారణలో కీలక విషయాలు వెల్లడించిన చెన్నై ఏజెంట్ • త్వరలో మరికొందరి అరెస్టు

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): నకిలీ ధ్రువపత్రాలు సృష్టిస్తూ.. పాస్‌పోర్టులు పొందిన కేసులో ప్రధాన నిందితులను సీఐడీ ఏడీజీ శిఖాగోయెల్ ఆదేశాల మేరకు పోలీసు కస్టడీకి తీసుకోనున్నట్టు ఈవోడబ్ల్యూ ఎస్పీ వెంకటలక్ష్మి తెలిపారు. ఇప్పటికే చెన్నైకి చెందిన పాస్‌పోర్టు ఏజెంట్‌ను విచారించినట్టు పేర్కొన్నారు. పోలీసు కస్టడీకి అనుమతి లభించిన వెంటనే అందరినీ వేర్వేరుగా విచారించి, మరిన్ని వివరాలు రాబడతామని వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితుల్లో ఒకడైన చెన్నై ఏజెంట్‌ను పోలీసులు విచారించగా పలు కీలక విషయాలు వెల్లడించినట్టు తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా విస్తరించిన ఈ ముఠా నకిలీ పత్రాలతో పాస్‌పోర్టులను సంపాదించడమే కాకుండా విదేశీయులు, దేశంలోకి అక్రమంగా చొరబడిన బంగ్లాదేశీయులు, రోహింగ్యాలకు కూడా భారతీయత ఉండేలా తప్పుడు ఐడీలు సృష్టించి, పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించినట్టు సీఐడీ పోలీసులు గుర్తించారు. స్పెషల్ బ్రాంచ్ పోలీసులకు లంచాలు ఇచ్చి ఆకట్టుకోవడం ఈ కేసులో ప్రధాన అంశం. భారతీయులు కాని వారికి సైతం ఇక్కడి జనన, విద్యార్హత, ఇతర ధ్రువీకరణ పత్రాలు ఇప్పించి విదేశాలకు విమానాలెక్కించారని విచారణలో వెల్లడైంది. పోలీసు విచారణ అనంతరం మరికొందరిని అరెస్టు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 108 పాస్‌పోర్ట్‌ల వివరాలు రాబడుతున్నారు. 15 మొబైల్ ఫోన్లు, 5 ల్యాప్ టాప్‌లు, 4 సీపీయూలు, 3 ప్రింటర్లు, 11 పెన్‌డ్రైవ్‌ల స్టోరేజ్‌ని రిట్రీవ్ చేస్తున్నారు.